క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



మంగొల్లు(వత్సవాయి): మండలంలోని మంగొల్లులో నూతనంగా నిర్మించనున్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి ఆదివారం భూమిపూజ చేశారు. వేదపండితులు పరిమి సుబ్రమణ్యం, తాండ్ర పవన్‌కుమార్‌శర్మ, వేమవరపు శివచరణ్‌శర్మ వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఆలయం జీర్ణోద్ధరణకు చేరడంతో ఆస్థానంలో నూతన ఆలయ నిర్మాణం చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు.

మునేటికి భారీగా వరద



వత్సవాయి: మునేటిలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తెలంగాణలో వర్షాలు పడుతుండటంతో వరదనీరు పోటెత్తింది. ఎగువ నుంచి ఆదివారం ఉదయానికి 12 అడుగుల మేర వరదనీరు రాగా అది క్రమేపీ సాయంత్రానికి పది అడుగలకు చేరింది. 20 వేల క్యూసెక్కుల మేర వరదనీరు వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. లింగాల కాజ్‌వే వద్ద వరద కాజ్‌వేకు ఆనుకుని ప్రవహిస్తోంది. దీంతో కాజ్‌వేకు ఇరువైపులా రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

మునేరుకు 375క్యూసెక్కుల నీరు

కంచికచర్ల: ఎగువ ప్రాంతాలైన పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, బోనకల్, వరంగల్, వైరా తదితర ప్రాంతాల్లో కుండపోతగా కురుస్తున్న వర్షాలకు మునేరుకు వరద నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కంచికచర్ల మండలం కీసర మునేరుకు 375 క్యూసెక్కుల నీరు చేరిందని సీడబ్ల్యూసీ అధికారులు ఆదివారం తెలిపారు. మునేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రైతులు తమ పశువులను తోలుకెళ్లరాదని తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు సూచించారు. నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

ఆందోళనలో రైతులు

- మైసమ్మ గండిని తాకిన మునేరు వరద
- గండ్లు పూడ్చని కూటమి పాలకులు
- ఇబ్బందుల్లో రైతులు



పెనుగంచిప్రోలు మునేరు కాజ్‌వే వద్ద వరద నీటి ఉధృతి



జలాశయాన్ని తలపిస్తున్న గండి పడిన ప్రాంతం



మైసమ్మ గండి వద్ద తువ్వకాలువ పరిస్థితి ఇలా

పెనుగంచిప్రోలు: ఎగువన ఉన్న ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు పెనుగంచిప్రోలు వద్ద మునేరుకు భారీగా వరదనీరు చేరుతోంది. మునేరుకు శనివారం అర్ధరాత్రికి 11అడుగుల మేర వరదనీరు చేరింది. గతేడాది సెప్టెంబర్‌లో సంభవించిన వరదలకు తువ్వకాలువకు పడిన గండ్లు పూడ్చకపోవడంతో ప్రస్తుతం వస్తున్న వరద నీరు మైసమ్మ గండిని తాకింది. మరో రెండు మూడు అడుగుల మేర వరద వస్తే గతంలో మాదిరే వరదనీరు పొలాలతోపాటు ముచ్చింతాల, అనిగండ్లపాడు, వేమవరం గ్రామాలను ముంచెత్తే పరిస్థితి ఏర్పడుతోందని ప్రజలు హడలిపోతున్నారు.

చెరువులను తలపిస్తున్న గండ్లు..

మునేరుకు సమాంతరంగా ఉండే ఈ తువ్వకాలువకు గతేడాది పడిన సుమారు 50 గండ్లను పూడ్చించే విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజల పాలిట శాపంగా మారింది. వారంరోజులుగా పడుతున్న వర్షాలకుతోడు ఎగువ నుంచి భారీగా వరద ఉధృతి ఉండటంతో గతేడాది గండ్లు పడినచోట ప్రస్తుతం భారీగా వరదనీరు చేరింది. కోతకు గురైన భూముల్లోంచి వరదనీరు ప్రవహిస్తుండటంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రకటనలకే పరిమితమైన పనులు..

తువ్వకాలువ గండ్లు పూడ్చివేత పనులు కూటమి పాలకులు, అధికారుల ప్రకటనలకే పరిమితమయ్యాయి. గండ్లూ పూడ్చివేతకు నిధులు మంజూరయ్యాయని ప్రకటనలు చేయడం మినహా పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. వత్సవాయి మండలం పోలంపల్లి మునేరు ప్రాజెక్టులో ప్రధానమైన కాలువల్లో ఒకటైన తవ్వకాలువ వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు వద్ద ప్రారంభమై వేమవరం, పెనుగంచిప్రోలు, ముచ్చింతాల, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు, వెంకటాపురం, శనగపాడు గ్రామాల వరకు సుమారు 3వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ఇంతటి ప్రధానమైన కాలువకు పడిన గండ్లను పూడ్చించే విషయంలో కూటమి పాలకులు నిర్లక్ష్యాన్ని వీడటం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే వచ్చే వేసవి వరకు గండ్లు పూడ్చివేత పనులు ప్రారంభించే అవకాశమే లేదని రైతులు చెబుతున్నారు.వరద ఉధృతి పెరిగి గతేడాది మాదిరిగానే పంట పొలాలను ముంచెత్తితే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా కూటమి పాలకులు స్పందించి తువ్వకాలువ గండ్లు పూడ్చించాలని రైతులు కోరుతున్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేకాలంకరణలో శ్రీతిరుపతమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారి నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావటంతోపాటు శ్రావణ మాసం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. అమ్మవారి నిత్యకల్యాణం వైభవంగా సాగింది. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

653 మందికి వైద్య పరీక్షలు

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఆదివారం జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రెండురోజులుగా కొనసాగుతున్న వైద్యశిబిరంలో మొత్తం 653మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోగా, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు

ఫౌండేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్దన్ తెలిపారు. వీరిలో 277మందికి కళ్లజోళ్లు, 35మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమని వైద్యులు గుర్తించారని వివరించారు. వారికి పెదకాకాని శంకర్ నేత్రాలయంలో ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్లు కట్టా నరసింహారావు, మైనేని రాధా, మున్సిపల్ కౌన్సిలర్లు, ఏఎన్ఎంలు, ఆర్పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా సోమవారం స్థానిక ఆర్టీసీ కాలనీలోని స్కిల్ కమ్యూనిటీ భవన్ వద్ద నిర్వహించే వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని క్యాంపు కోఆర్డినేటర్ కోరారు.

కోతకు గురైన రోడ్డు



కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న దొడ్డదేవరపాడు ఆర్‌అండ్‌బీ రహదారి

వీరులపాడు: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల పరిధిలోని ఆర్‌అండ్‌బీ రహదారులు కోతకు గురయ్యాయి. మండలంలోని దొడ్డదేవరపాడు గ్రామానికి వెళ్లే రహదారి కోతకు గురై గోతులమయమైంది. ఈ రహదారి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలను కలిపే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డు కోతకు గురికావడంతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు కోతకు గురైన చోట్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

నందిగామరూరల్: పట్టణంలో వేంచేసియున్న శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వరస్వామి ఆలయంలోని హుండీ కానుకలను సోమవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో సురేష్, అనువంశిక ధర్మకర్త రాఘవకుమార్ ఆదివారం తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో సాగే ఈ హుండీ లెక్కింపులో ఆసక్తిగల భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

విద్యార్థినికి చేయూత

నందిగామరూరల్: కంచికచర్ల మండలం కీసర గ్రామానికి చెందిన కారుణ్యకు ఆర్యవైశ్య సంఘ నాయకులు రూ.4వేలు విలువగల పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పారేపల్లి సాయిబాబు, పబ్బతి జనార్దనరావు, కొత్తూరు జనార్దనరావు, రవీంద్రనాథ్, భాస్కరరావు, బాబురావు పాల్గొన్నారు.

వైద్యశిబిరం నిర్వహణ

చందర్లపాడు(నందిగామటౌన్): గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్ సూచించారు. మండలంలోని కోనాయపాలెంలో సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు మొత్తం 800 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వైద్యులు సీతారామ్, యోగేంద్ర, వెంకటరమణ, ప్రేమ్‌సాయి, రమ్య, గ్రామనాయకులు, సేవా ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా : సీఐ

నందిగామటౌన్: రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని సీఐ వైవిఎల్ నాయుడు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరు చెడు నడతను వీడి సమాజహితానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ అభిమన్యు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన రాచమంటి శంకర్ దంపతులు రూ. 25,116లను విరాళంగా అందించినట్లు ఈవో సాంబశివరావు ఆదివారం తెలిపారు. దాతలకు పూజల అనంతరం స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో తిరునగరి రామకృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాలు



ఊరేగింపుగా బోనాలు తీసుకువెళ్తున్న భక్తులు



ప్రత్యేకాలంకరణలో ముత్యాలమ్మ తల్లి



ప్రత్యేకాలంకరణలో శ్రీసత్యమ్మ తల్లి

పెద్దాపురం(వీరులపాడు): పెద్దాపురం గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారికి గ్రామస్తులు ఆదివారం బోనాలు సమర్పించారు. మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ముందుగా ప్రత్యేక పూజలు చేసి బోనాలు చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కోటేరు లక్ష్మి, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

శ్రీముత్యాలమ్మకు పూలంగి సేవ

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం శ్రావణమాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పుష్పాలంకరణ సేవ నిర్వహించారు. అమ్మవారిని భారీసంఖ్యలో మహిళలు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థాన కుమ్మరి శాలివాహన వంశస్తులు అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

■ 19న శ్రీచండీ మూలమంత్ర హోమం...

శ్రావణ మాసం నాలుగో మంగళవారం సందర్భంగా ఈనెల 19వతేదీన శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఉదయం శ్రీచండీ మూలమంత్ర హోమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరుకావాలని కమిటీ సభ్యులు కోరారు.

శ్రీసత్యమ్మ తల్లికి బోనాలు..

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని తొర్రగుంటపాలెం ఆర్టీసీ కాలనీలో వేంచేసియున్న శ్రీసత్యమ్మ తల్లికి ఆదివారం బోనాల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. ప్రభ బండిపై పసుపు కుంకుమ, పూలు, గాజులు, చీర సారెలను ఉంచి మేళతాళాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి సమర్పించారు.

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు ఆదివారం తెలిపారు. ఆయా సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని ఆయన సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో

నందిగామరూరల్: వాతావరణ శాఖాధికారులు చేస్తున్న తుఫాన్ ప్రకటనలతోపాటు ఎగువ నుంచి వస్తున్న వరదల కారణంగా మునేరుకు వరద పెరిగే అవకాశం ఉందని ఆర్డీవో బాలకృష్ణ తెలిపారు. తన కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 31వేల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తోందన్నారు. వరద పెరిగే అవకాశం ఉన్నందున మునేరు, వైరాకట్టలేరు పరివాహక గ్రామాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అధికారులు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. వరద పెరిగితే ముంపు ప్రాంతాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు.

మధురంగా సాగిన గాత్ర సంగీత సభ



విజయవాడకల్చరల్: నెలవారీ కార్యక్రమంలో భాగంగా బీఆర్‌టీఎస్ రోడ్డులోని శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో స్వరఝరి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు పెమ్మరాజు సూర్యారావు స్మృత్యర్థం ఆదివారం నిర్వహించిన సంగీత కార్యక్రమం వాగ్గేయకారుల కృతి వైభవాన్ని చాటింది. తమిళనాడుకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు భరత్ సుందర్ నిర్వహించిన కర్నాటక సంగీత సభ మధురంగా సాగింది. సంగీత త్రిమూర్తులు త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రిలు స్వరపరచిన కీర్తనలను ఆలపించారు. శ్రీ సాయి రక్షిత్, పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్, మార్టూరి హరిబాబు వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన స్వరఝరి ప్రధాన కార్యదర్శి మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతం నిరంతరం ప్రవహించే స్వరఝరి అన్నారు. సంగీత విద్వాంసుడు భరత్ సంగీత సేవలను వివరించారు.